
సాక్షి ఒడిశా

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,23,731లు, వెండి 117 గ్రాముల 780 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా

రాయగడ జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ చినసారి ఘాట్ రోడ్డులో గురువారం ఆటో బోల్తాపడిన దుర్ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, మరో 15 మంది తీవ్ర గాయాలకు గురయ్యారు. - 8లో



మంత్రి సురేష్ పూజారిని కలిసిన ఎమ్మెల్యే నర్సంగ్

రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో రెవెన్యూ మంత్రి సురేష్ పూజారిని మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సంగ్ మద్కామి గురువారం కలిశారు. - 8లో

రేషన్ కష్టాలు..!



రేషన్ బియ్యం తీసుకోవడంలో పలువురికి ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా వృద్ధులకు బయోమెట్రిక్ సరిగా పడకపోవడంతో కష్టాలు పడుతున్నారు. కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితి చంబికోట ప్రాంతంలో రేషన్ తీసుకోవడానికి ట్రాలీలో ఒక వృద్ధుడిని తీసుకెళ్లిన ఘటన సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయ్యింది. లెంగు టెప్రిక అనే వృద్ధుడు పక్షపాతంతో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో అతని భార్య తులసా టెప్రిక రేషన్ బియ్యం తీసుకోవడానికి బయోమెట్రిక్ వేసినా సరిగా పడకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. బయోమెట్రిక్ వేయకపోతే బియ్యం ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో, రూ.100ల అద్దెకు రిక్షాను మాట్లాడుకొని వృద్ధుడిని రేషన్ డిపో వద్దకు తీసుకెళ్లింది. అనంతరం అదే ట్రాలీలో బియ్యం తీసుకొని ఇంటికి తిరుగు ప్రయాణమైంది. ఈ విషయం వైరల్ కావడంతో పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించారు. వచ్చే నెల నుంచి బియ్యాన్ని బాధితుడి ఇంటికి పంపిస్తామని ప్రకటించారు.

- కొరాపుట్

మరోజన్మ..!

- 60 కిలోమీటర్లు నదిలో కొట్టుకువచ్చిన మహిళ
- ప్రాణాలు కాపాడిన మత్స్యకారులు



గ్రామస్తుల చెంతన ఉన్నటువంటి మహిళ

భువనేశ్వర్: మహానదిలో సుమారు 50 నుంచి 60 కిలోమీటర్లు పొడవునా కొట్టుకువచ్చిన మహిళ సురక్షితంగా ప్రాణాలతో బయటపడింది. ఈ సంఘటన గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఈమె ఛత్తీస్‌గఢ్‌లోని మహానదిలో గల్లంతై కొట్టుకు వచ్చినట్లు ప్రాథమిక సమాచారం. రాష్ట్రంలో ఝార్సుగుడ జిల్లాలో స్థానికులు రక్షించారు. ఈ వర్గాల సమాచారం మేరకు బాధిత మహిళ ఛత్తీస్‌గఢ్ పురత్ గ్రామానికి చెందిన సరోజిని రణ్‌వీర్. ఝార్సుగుడ జిల్లా లఖన్‌పూర్ మండలం పరిధిలోని పల్సాడ్ ఘాట్ నుంచి రక్షించినట్లు వర్గాలు తెలిపాయి. నది ప్రవాహంలో కొట్టుకుపోతున్న మహిళను కొందరు స్థానిక వ్యక్తులు గమనించారు. దీంతో వెంటనే మత్స్యకారులు ఆమెను రక్షించేందుకు నదిలోకి దూకారు. కొట్టుకుపోతున్న మహిళను ప్రాణాలతో కాపాడగలిగారు. తీరం చేర్చిన తర్వాత ఆమె పాదాలను గొలుసుతో కట్టివేసినట్లు గుర్తించారు. దీంతో ఆమెకు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటన పూర్వాపరాలు స్పష్టం కావాల్సి ఉంది. కాళ్లకు గొలుసు సంకెళ్లతో వరద పొంగుతో పొరలుతున్న మహానదిలో కొట్టుకురావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై స్థానికుల సమాచారం మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కాగా 4 ఏళ్ల క్రితం ఇటువంటి సంఘటనే చవి చూసినట్లు సమాచారం. 2020 సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి మహానదిలో కొట్టుకుని సోనీ యాదవ్ అనే యువతి వచ్చినట్లు గుర్తు చేశారు.

న్యూస్‌రీల్

పారాదీప్ పోర్టు అదుపులో చైనా ఓడ



పారాదీప్ తీరంలో ఉన్నటువంటి చైనా ఓడ

భువనేశ్వర్: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు పారాదీప్ పోర్ట్ అధికార వర్గాలు చైనా కార్గో షిప్‌ను అదుపులోకి తీసుకున్నారు. ద్రవ్య వివాదానికి సంబంధించిన కేసు విచారణ పురస్కరించుకుని రాష్ట్ర హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారి ఒకరు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఓడ రేవులోనే నిర్బంధించబడుతుందని పేర్కొన్నారు. రూ.99.81 లక్షలు చెల్లించడంలో ఓడ యజమాని విఫలమయ్యారని కార్గోను పంపిన కంపెనీ హైకోర్టుకు వివరాలు సమర్పించింది. ఆ పత్రాలు మరియు వాదనలను పరిశీలించిన తర్వాత రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఓడ అరెస్టు ఉత్తర్వులు జారీ చేసింది.

హత్యకేసు నిందితుడు లొంగుబాటు



గౌరి పలక (ఫైల్)

రాయగడ: తాగిన మైకంలో భార్యపై దాడిచేసి కిరాతకంగా హత్య చేసిన భర్త స్వయంగా సదరు పోలీసుస్టేషన్‌లో గురువారం లొంగిపోయాడు. స్థానిక బుదరావలసలోని కళాశాల రోడ్డులో జులై 28వ తేదీన పి.గౌరి పలక అనే వ్యక్తి, తన భార్య గౌరిశ్రీ(45)పై ఇనుప రాడ్డుతో దాడిచేసి హత్య చేసిన సంగతి తెలిసిందే. హత్య చేసిన అనంతరం ఆయన పరారయ్యాడు. ఈ కేసుకు సంబంధించి సదరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయ్యింది. కాగా నాలుగు రోజుల అనంతరం నిందితుడు గౌరి సదరు పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు నిందితుడిని కోర్టుకు తరలించారు.

నచ్చిక లింగపై 50వ కేసు కొట్టివేత



నచ్చిక లింగ

కొరాపుట్: మావోయిస్టు సానుభూతిపరుడు, రైతు కూలీ సంఘం (చాసి మూల్య సంఘ్) నాయకుడు నచ్చిక లింగ మీద ఉన్నటువంటి 50వ కేసుని కోర్టు కొట్టేసింది. ఈ మేరకు అతని న్యాయవాది గుప్తేశ్వర్ పాణిగ్రాహీ వివరాలను గురువారం ప్రకటించారు. ఇంతవరకు అతడిపై ఉన్నటువంటి 49 కేసులు సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కొట్టి వేసింది. అయితే 2009 నవంబర్ 20న నారాయణపట్న పోలీస్‌స్టేషన్‌పై దాడి కేసు కొనసాగింది. ఈ కేసు కూడా కొరాపుట్ జిల్లా అదనపు జడ్జి కోర్టు కొట్టివేయడం జరిగింది. నచ్చిక లింగ 2014 నుంచి 2020 వరకు జైల్‌లో ఉన్నారు. సుప్రీం కోర్టులో బెయిల్ తీసుకొని విడుదలయ్యారు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకొని సాధారణ జీవితం గడుపుతున్నారు.

బీజేపీలో చేరిన మమతా మహంత



బీజేపీ నాయకులతో మమతా మహంత

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ (బీజేడీ) పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మర్నాడే రాష్ట్రానికి చెందిన ప్రముఖ గిరిజన నాయకురాలు మమతా మహంత గురువారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో సీనియర్ నేతల సమక్షంలో మమత భారతీయ జనతా పార్టీలో చేరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్ పాల్ సింగ్ తోమర్, జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, ఇతర నాయకుల సమక్షంలో ఆమెకు పార్టీ శాలువా, టోపీ సమర్పించి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బీజేపీకి చెందిన మయూర్‌భంజ్ ఎంపీ అనంత నాయక్, రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఇతర నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. గిరిజన ప్రభావిత మయూర్‌భంజ్ జిల్లాకు చెందిన మమత మహంత బుధవారం బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి మరియు పార్లమెంట్ ఎగువ సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామా తక్షణమే అమల్లోకి వచ్చేలా ఆమోదించినట్లు రాజ్యసభ చైర్‌పర్సన్ జగదీప్ ధన్‌కర్ బుధవారం సభకు తెలియజేసిన విషయం తెలిసిందే.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థులు



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన డైట్ విద్యార్థులు



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ వ్యవహార శైలిపై చర్యలు తీసుకోవాలని ఆ సంస్థలో ద్వితీయ సంవత్సరం శిక్షణ పొందుతున్న విద్యార్థులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయానికి గురువారం వెళ్లి కలెక్టర్ మహాజన్‌కు సమస్యలు వివరించారు. శిక్షణ సంస్థలో ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న శరత్ చంద్ర తమపై లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని విద్యార్థినులు ఆరోపించారు. తరగతులు పూర్తయిన తర్వాత తన గదిలోకి రమ్మని అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా తమ సమస్యలను వివరించేందుకు వచ్చిన విద్యార్థులు సుమారు గంటన్నర సమయం కలెక్టర్ కార్యాలయం బయట వేచి ఉన్నారు. కలెక్టర్ అత్యవసర సమావేశంలో ఉండడంతో సమస్యను తెలుసుకునేందుకు డిప్యూటీ కలెక్టర్ బిచిత్ర శెఠి, జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ నాయక్‌లు వచ్చారు. అనంతరం కలెక్టర్‌తో కొంతమంది విద్యార్థులు మాట్లాడారు.

చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ మహాజన్

విద్యార్థుల ఆరోపణలు విన్నటువంటి కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను సంబంధిత శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే శిక్షణ పొందుతున్న విద్యార్థులు సరిగ్గా తరగతులకు హాజరవ్వడం లేదని శిక్షణ సంస్థలోని ఒక ఉపాధ్యాయుడు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలకు సంబంధించి గురువారం ఫారం ఫిలప్ ఉన్న నేపథ్యంలో, 80 శాతం తరగతులకు హాజరైన విద్యార్థులు మాత్రమే ఫారం ఫిలప్‌కు అర్హులుగా ప్రకటించడంతోనే కక్షకట్టి విద్యార్థులంతా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.



విద్యార్థుల ఆరోపణలను వింటున్న డిప్యూటీ కలెక్టర్ బిచిత్ర శెఠి

మాజీ ఎమ్మెల్యే జీవిత ఖైదు నిలిపివేత

- ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు

భువనేశ్వర్: గంజాం జిల్లా ఛత్రపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి నారాయణరెడ్డికి విధించిన జీవిత ఖైదు శిక్షను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మాజీ ఎమ్మెల్యే పోలీస్ ఇన్‌స్పెక్టర్ మృతి కేసులో హత్యారోపణ నిందితుడు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టకుండా వెసులుబాటు కల్పించింది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన మేరకు నిందిత మాజీ ఎమ్మెల్యేకు తాత్కాలిక బెయిలు మంజూరు కోసం ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

ఇదీ విషయం...

1998వ సంవత్సరం జూన్ 18న విధి నిర్వహణలో ఉన్న రిజర్వ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ బినోబా మెహెర్ మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తులు బాంబు రువ్వడంతో ఈ విషాదం చోటు చేసుకుంది. టాటా స్టీల్ కార్ఖానా ఏర్పాటు నేపథ్యంలో తలెత్తిన భూ సేకరణ వ్యతిరేక ప్రదర్శనల తాకిడితో శాంతిభద్రతలకు భంగం కలగకుండా చర్యలు చేపట్టే విధుల కోసం బినోబా మెహెర్ సింధిగావ్‌లో నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వహిస్తున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ అకాల మరణానికి గురయ్యారు. ఈ సంఘటనలో మాజీ ఎమ్మెల్యేతో పాటు మరి కొందరికి వ్యతిరేకంగా ఐపీసీ 302 సెక్షన్ ప్రకారం హత్యారోపణతో కేసులు నమోదు చేశారు. ఈ కేసులో 22 మందిని ప్రతివాదులుగా నమోదు చేసి హత్యా నేరం మోపారు.

2023లో జీవిత ఖైదు విధింపు

2023 జులై 31న బినోబా మెహెర్ మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగిరెడ్డి నారాయణరెడ్డితో పాటు మరో 12 మందికి ఎంపీలు, ఎమ్మెల్యేల అదనపు జిల్లా జడ్జి కమ్ స్పెషల్ జడ్జి కోర్టు జీవిత ఖైదు విధించింది. దీంతో రెడ్డితో పాటు మరో ఇద్దరు నిందితులు తమ శిక్షను సవాలు చేస్తూ రాష్ట్ర హైకోర్టులో క్రిమినల్ అప్పీల్ దాఖలు చేశారు. తమకు విధించిన శిక్ష అమలును నిలిపివేయాలని ఉన్నత న్యాయస్థానానికి అభ్యర్థించారు. సాక్ష్యాధారాలు మరియు పరిసర పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఉన్నత న్యాయస్థానం సమీక్షించింది. జస్టిస్ దేబబ్రత దాస్, జస్టిస్ వి.నరసింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం జీవిత ఖైదు అమలును నిలిపివేసింది. ఈ అప్పీల్ కేసు తదుపరి విచారణను నవంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది. ట్రయల్ కోర్ట్ అప్పీలుదారులకు (రెడ్డి మరియు మరో ఇద్దరు) విధించిన శిక్షపై విచారణ కొనసాగుతున్నందున తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో నాగిరెడ్డి నారాయణరెడ్డి మరియు ఇతర ఇద్దరు అప్పీలుదారులను ట్రయల్ కోర్టు నిబంధనల మేరకు బెయిల్‌పై విడుదల చేయాలని ఉన్నత న్యాయస్థానం ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది.

ఒడిశాతో బొల్లినేని మెడిస్కిల్స్ ఎంవోయూ



అవగాహన ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

పర్లాకిమిడి: ఒడిశా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు ఆ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా తొలుత గజపతి జిల్లా విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆ జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సమక్షంలో అధికారులతో ఎంవోయూ కుదుర్చుకున్నామన్నారు. ఇప్పటివరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది సంవత్సరాలుగా 9,200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, 8800 మంది విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఒడిశా ప్రభుత్వం తమ సంస్థతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గజపతి జిల్లా ఉపాధి కల్పన అధికారి సౌభాగ్య ఎస్ ఆర్, త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వలలో బీఈవో



పట్టుబడిన రబీ శంకర్

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి సీనియర్ అసిస్టెంట్ బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రబీ శంకర్ పాత్రో రూ.5 వేల లంచం తీసుకుంటూ విజిలెన్స్‌కు గురువారం పట్టుబడ్డారు. జిల్లా కేంద్రంలోని ఒక పాఠశాల ఉపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. నిందితుడిని కొరాపుట్ విజిలెన్స్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

భార్యను హత్య చేసిన వ్యక్తికి మరణ శిక్ష



హంతకుడు సంజిత్ దాస్

భువనేశ్వర్: భార్యను హత్య చేసిన ఘటనలో భర్తకు స్థానిక న్యాయస్థానం గురువారం మరణ శిక్ష విధించింది. రెండేళ్ల కిందట ఈ ఘోరం చోటు చేసుకుంది. స్థానిక ఘటికియా ప్రాంతంలో నిందితుడు సంజిత్ దాస్ తన భార్య సరస్వతిని చాకుతో 33 సార్లు పొడిచి చంపిన హత్యారోపణ కింద స్థానిక ఏడీజే-2 న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. ఈ దారుణమైన నేరం జూన్ 2022 సంవత్సరంలో సంజిత్ దాస్ ఇంట్లో జరిగింది. కేసు విచారణ పురస్కరించుకుని 15 మంది సాక్షుల వాంగ్మూలాలు, బలమైన ఆధారాలు, వేలిముద్రలు, 18 ఇతర పత్రాల ఆధారంగా మరణశిక్ష విధించినట్లు న్యాయస్థానం పేర్కొంది. సంజిత్ దాస్ తల్లి, కుమార్తె మరియు కోడలు నుంచి హృదయ విదారక కథను విన్న తర్వాత న్యాయమూర్తి ఈ తీర్పును ప్రకటించారు. బీఎస్సీ గ్రాడ్యుయేట్ అయిన సంజిత్ దాస్ ఘటికియాలోని వారి ఇంట్లో తన భార్య సరస్వతిని వంటగదిలో ఉపయోగించే కత్తితో 33 సార్లు పొడిచాడు. వారి ఆరేళ్ల కుమార్తెపై కూడా కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. మైనర్ కుమార్తె తన గాయాల నుంచి కోలుకోవడానికి మూడు నెలలు పట్టింది. నేరం చేసిన తర్వాత సంజిత్ దాస్ ఘటికియా ప్రాంతంలో తిరుగాడుతుండగా స్థానిక భరత్‌పూర్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. సంజిత్ దాస్ మాదక ద్రవ్యాలకు బానిస అయ్యాడు. అతని భార్య సరస్వతితో తరచూ గొడవలు పడుతుండేవాడు. ఆమె నర్సుగా తన సొంత ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునేది. 2022 సంవత్సరం జూన్ 22 రాత్రి సంజిత్ మరియు సరస్వతి మధ్య గొడవ జరిగింది. సంజిత్ మత్తులో ఉన్న స్థితిలో చికాకు పడటంతో కలహం వికృత రూపం దాల్చింది.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు



నాటుసారా తయారీ కేంద్రంపై దాడులు నిర్వహిస్తున్న దృశ్యం



ఊటను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి ముకుందపూర్, లక్ష్మీపూర్ ప్రాంతాల్లో ఎక్సైజ్, పోలీసు శాఖల సిబ్బంది సంయుక్తంగా బుధవారం సాయంత్రం నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. నదీతీర ప్రాంతాల్లో నాటుసారాను అక్రమంగా తయారీ చేసి, వాటిని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఈ దాడులను చేపట్టారు. దీనిలో భాగంగా ముకుందపూర్ ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో 2150 లీటర్ల నాటుసార తయారీకి వినియోగించే ఊటను ధ్వంసం చేయగా, మరో 190 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా లక్ష్మీపూర్ కూడలిలో నిర్వహించిన దాడుల్లో అజిత్ కుమార్ కొరకొరియా, గౌమతి బిడికను అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. అలాగే నాటుసారా తయారీకి వినియోగించే వంట సామగ్రిని సైతం భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి



స్మరణికను ఆవిష్కరిస్తున్న అతిథులు

రాయగడ:

విద్యార్థులు చిన్నప్పటి నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా సూచించారు. స్థానిక మహిళా కళాశాల 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కళాశాల సభా భవనంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తన ప్రతిభకు పదును పెట్టాలన్నారు. విద్యార్థి దశలోనే తన భవిష్యత్‌పై ప్రణాళికలు రూపొందించుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. ఆసక్తి గల రంగాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా అడుగులు వేస్తే వారికి భవిష్యత్ బంగారు బాటగా మారుతుందన్నారు. కళాశాల గవర్నింగ్ బాడీ అధ్యక్షుడు, విద్యావేత్త డాక్టర్ దుస్మంత్ కుమార్ మాహంతి మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులు ఈ కళాశాలలో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా పట్టణంలోని ఈ మహిళా కళాశాల ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చనా పట్నాయక్ కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

వ్యవసాయాధికారి బలరాం సుబుద్ధి బదిలీ


బలరాం సుబుద్ధి

పర్లాకిమిడి: గజపతి జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి బలరాం సుబుద్ధి పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన భువనేశ్వర్‌లో రాష్ట్ర కృషి విభాగం డిప్యూటీ డైరక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆయన స్థానంలో జాజ్‌పూర్ జిల్లా నుంచి వ్యవసాయ అభివృద్ధి అధికారి సురేంద్రనాథ్ స్వయిని రానున్నారు.

మన్మోహన్ సామల్ పర్యటన నేడు

రాయగడ: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, సాధారణ కార్యదర్శి మానస్ కుమార్ మహంతిలు కొరాపుట్, రాయగడ, గజపతి జిల్లాల్లో శుక్రవారం నుంచి పర్యటించనున్నారు. దీనిలో భాగంగా ఈనెల 2వ తేదీన కొరాపుట్‌లోని సర్క్యూట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం కొరాపుట్‌లోని ఆదివాసీ సంగ్రాలయంలో జరిగే పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం కొరాపుట్ జిల్లాలోని లక్ష్మీపూర్‌లోని సర్క్యూట్ హౌస్‌లో కార్యకర్తలతో సమావేశమవుతారు. 3వ తేదీ ఉదయం 8 గంటలకు రాయగడ చేరుకుని 10.30 గంటలకు సర్క్యూట్ హౌస్‌లో నిర్వహించనున్న విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం స్థానిక సిరిగుడలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం జిల్లాలోని బిసంకటక్, గుణుపూర్‌లో పర్యటిస్తారు. 4వ తేదీ ఉదయం గజపతి జిల్లా పర్లాకిమిడిలో జరగనున్న కార్యకర్తలు, విలేకరుల సమావేశంలో పాల్గొంటారు.

1300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కాశీబుగ్గ: మందస మండలం కొండలోగాం గ్రామంలో నాటుసారా స్థావరాలపై సెబ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. సోంపేట సబ్ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 1300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. మందస మండలంలో నాటు సారా తయారీను నివారించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

కంబకాయలో పిచ్చికుక్క స్వైర విహారం


కుక్క దాడిలో గాయపడి ఆస్పత్రిలో చేరిన కంబకాయ వాసులు

నరసన్నపేట: మండలం కంబకాయలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఈ కుక్క దాడిలో గురువారం బైరి కృష్ణారావు, అల్లు రాజబాబు, గొండు నీలమ్మ, చెట్టు సరోజినిలతో పాటు మరొకరు గాయపడ్డారు. మూడు రోజుల కిందట ఇదే కుక్క కొరగాన నారాయణ, గుజ్జిడి నాగేశ్వరరావు, తాన్ని రాజారావులకు చెందిన మూడు ఆవులు, రెండు మేకలపై దాడి చేసి గాయపరచగా అవి మృతి చెందినట్లు గ్రామస్తులు పాగోటి భరద్వజ్ తెలిపారు. గాయపడిన వారిని స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి ఇంజెక్షన్లు వేయించారు.

రైలు నుంచి జారి పడి మహిళకు గాయాలు

జలుమూరు: తిలారు రైల్వేస్టేషన్‌లో ట్రైన్ ఎక్కుతూ మహిళ జారిపడి తీవ్రగాయాలపాలయ్యారు. గురువారం ఉదయం పాతపట్నానికి చెందిన బోహర సంతోషి అనే మహిళ విశాఖకు వెళ్లేందుకు పాసింజర్ ట్రైన్ ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడిపోయారు. అదే సమయంలో ట్రైన్ కదలడంతో పట్టాల్లో కాలు ఇరుక్కుపోయి నుజ్జుయిపోయింది. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

విభిన్న ప్రతిభావంతుల చట్టాలు అమలుచేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతుల చట్టాలు, వారి సంక్షేమాలు అమలు చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు తెలిపారు. గురువారం జిల్లాలో కోర్టు ఆవరణలోని న్యాయ సేవ సదన్‌లో ప్రభుత్వ అధికారులు, ఎన్జీఓలు అధికారులతో సమావేశం నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు బాధితులు ఎదుర్కొంటున్న సవాళ్లు, అడ్డంకులు, అంతరాల గురించి ప్రభుత్వ అధికారులతో చర్చించారు. విభిన్న ప్రతిభావంతులకు సామాజిక హోదాను కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్జీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సుశాంత్ సెంచరీ మిస్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన స్టార్ క్రికెటర్ నంబళ్ల సుశాంత్ తన అద్భుత బ్యాటింగ్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తాజాగా విశాఖపట్నంతో జరిగిన మ్యాచ్‌లో 88 పరుగులతో సెంచరీ చేజార్చుకున్నాడు. వైఎస్సార్ కడప జిల్లాలో కేఓఆర్ఎం కాలేజ్ క్రికెట్ మైదానంలో బుధవారం విశాఖపట్నంతో మొదలైన కీలక మ్యాచ్‌లో సుశాంత్ మరోసారి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జిల్లా సుశాంత్ కీలక ఇన్నింగ్స్ ఆడి రాణించడంతో 66.2 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌటై గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ 170 బంతుల్లో 15 బౌండ్రీల సహాయంతో 88 పరుగులు చేసి అవుటయ్యాడు. జిల్లాకే చెందిన మరో ఆటగాడు కల్యాణ్‌కుమార్ 72 పరుగులతో రాణించి ఆకట్టుకున్నాడు.

సుప్రీంకోర్టు తీర్పు వర్తింపజేయాలి

- మాజీమంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయిం



భువనేశ్వర్: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉప వర్గీకరణ పురస్కరించుకుని క్రిమిలేయర్ వర్గాలను మినహాయించాలని 7 మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం తీర్పు వెల్లడించింది. ఈ తీర్పుపై బిజూ జనతా దళ్‌కు చెందిన మాజీ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయిం హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్ తెగల కేటగిరీల్లోని మరింత వెనుకబడిన వారికి ప్రత్యేక ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. ఇదో చారిత్రాత్మక తీర్పుగా నిలుస్తుందని పేర్కొన్నారు. దళితులు మరియు ఆదివాసీ వర్గాల్లో మరింత వెనుకబడిన వారికి మరిన్ని అవకాశాలను పొందడానికి, ఒక స్థాయికి ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం కాకుండా అర్హులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ఈ తీర్పును వర్తింపజేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

మార్గదర్శకాలు ఖరారు చేయాలి

ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణ పురస్కరించుకుని క్రిమిలేయర్ వర్గాలను గుర్తించేందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలను ఖరారు చేయాలి. రిజర్వేషన్ లబ్ధితో ఎదుగుదల సాధించిన వర్గాలను ఈ వర్గం నుంచి తొలగించేందుకు పటిష్టమైన విధాన ఆవిష్కరణ అవసరంగా ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. అలాగే ఇతర వెనుకబడిన వర్గాల నుంచి లబ్ధి పొంది ఎదిగిన వారిని తొలగించే కార్యాచరణ ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణలో వర్తింపజేయడం ఒక సోపానంగా ధర్మాసనం పేర్కొంది. రిజర్వేషన్ తొలి తరానికి మాత్రమే పరిమితం కావాలని ఈ ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేయడం విశేషం. రిజర్వేషన్ సౌలభ్యంతో ఉన్నత స్థాయికి ఎదిగిన వారి కుటుంబాల్లో ఇతరులకు ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ సౌకర్యం నుంచి మినహాయింపు కల్పించాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. 7 మంది న్యాయమూర్తుల సుప్రీం ధర్మాసనంలో 6 మంది న్యాయమూర్తుల్లో ఏకాభిప్రాయం వ్యక్తం కావడం విశేషం. (6:1 మెజారిటీతో) షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉప వర్గీకరణ ఆయా వర్గాల్లో మరింత వెనుకబడిన వారికి ప్రత్యేక కోటాలను మంజూరు చేయడానికి దోహదపడుతుందని వీరిలో ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఉప వర్గీకరణ భారత రాజ్యాంగం ఆర్టికల్ 14ను ఉల్లంఘించదని సుప్రీంకోర్టు పేర్కొంది.

ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా


ఆటో వద్ద గాయాలతో మహిళలు

- ఒక మహిళ మృతి
- 15 మందికి గాయాలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ చినసారి ఘాట్ రోడ్డులో గురువారం ఆటో బోల్తా పడిన దుర్ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, మరో 15 మంది తీవ్రగాయాలకు గురయ్యారు. క్షతగాత్రులను గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. పద్మపూర్‌కు చెందిన 16 మంది మహిళలు కూలి పనుల కోసం చినసరి గ్రామానికి ఆటోలో వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా చినసరి ఘాట్ రోడ్డు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 16 మందిలో ఒకరు మృతి చెందగా, మిగతా 15 మంది తీవ్రగాయాలకు గురయ్యారు. మృతురాలు పద్మపూర్ గ్రామానికి చెందిన మాయా సాహు(45)గా సమాచారం. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో గుణుపూర్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోత, తహసీల్దార్ లీలావతి ఆచార్య, బీడీవో శ్రద్ధాంజలి ప్రధాన్‌లు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారికి చెప్పారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ


వైద్యాధికారితో మాట్లాడుతున్న అధికారులు

భయపెట్టిన స్కార్పియో

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం కేశవరావుపేట కూడలి కింతలిమిల్లు వద్ద గురువారం భయపెట్టింది. బండి ఒక్కసారిగా అదుపు తప్పి ఎడమ వైపు రోడ్డు నుంచి కుడివైపు రోడ్డు డివైడర్ పైనుంచి వెళ్లి సర్వీస్ రోడ్డు ఇనుప కంచెను ఢీ కొట్టింది. దీంతో స్కార్పియో ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. మరో పక్క ప్రధాన రోడ్ల నుంచి వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్‌తో పాటు, మరో ఇద్దరు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఎచ్చెర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరు పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య క్రమబద్ధీకరించారు.


దెబ్బ తిన్న స్కార్పియో వాహనం

పర్యాటక అభివృద్ధికి చర్యలు


పర్యాటక శాఖ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పర్యాటక అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక మండలి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి గురువారం నిర్వహించారు. శాలిహుండం మాన్యుమెంట్ కోసం వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీముఖలింగం టెంపుల్ గురించి ఎవరెవరు ఏం చేస్తారో ఆరా తీశారు. అరసవల్లి అభివృద్ధికి సంబంధించి జిల్లా నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని అధికారులు తెలిపారు. శ్రీముఖలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి దేవదాయ శాఖ రూ.4 కోట్లు మంజూరు చేయగా టెండర్లు పూర్తయినట్లు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ చెప్పారు. వజ్రపుకొత్తూరు వద్ద టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు భూ సమస్య ఉండగా.. సంబంధిత రైతులతో చర్చించి ప్రాజెక్టు వస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలియజేయాలని పలాస ఆర్డీఓను ఆదేశించారు. అమృత్ పార్క్ అభివృద్ధి చేసి థర్డ్ పార్టీకి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గొట్టాబ్యారేజ్ వద్ద బోటింగ్ ఏర్పాటుకు పాయింట్ గుర్తించిట్లు నారాయణ రావు చెప్పారు. భావనపాడు వద్ద పర్యాటక అభివృద్ధికి కావాల్సిన భూమి ఇస్తామని కలెక్టర్ చెప్పారు. ఇప్పిలి వద్ద పర్యాటక అభివృద్ధికి అక్కడ భూ సమస్యకు సంబంధించి జాయింట్ సర్వే చేయాలని కలెక్టర్ ఆర్డీఓను ఆదేశించారు. అలాగే డచ్ బిల్డింగ్, శాంతినగర్ పార్కు, గనగళ్లవానిపేట బీచ్, టెంపుల్ టూరిజంపై సమీక్షించారు. జిల్లా పర్యాటక ప్రాంతాలపై కాఫీటేబుల్ బుక్ తయారు చేయాలన్నారు. గనగళ్లవారిపేట వద్ద అభివద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగరమాలలో ఫిషింగ్ జెట్టీల కోసం కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు చెప్పారు.

అలారం సెలైన్.. విజయం సాధించెన్

- అటల్ మారథాన్‌లో ఇప్పిలి స్కూల్ ఎంపిక


ఇప్పిలి జిల్లా పరిషత్‌లో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, సెలైన్ రిమైండర్

శ్రీకాకుళం రూరల్: ఏటా ఇండియాలో నిర్వహించే అటల్ మారథాన్ 2023–24కు గాను రాష్ట్రం తరఫున శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. టాప్ 500లో ఈ పాఠశాల రెండో స్థానంలో నిలవడం విశేషమని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎ.సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపా రు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే దీనికి అవకాశం ఉంటుంది. ఈ అరుదైన అవకాశాన్ని ఇప్పిలి స్కూల్ విద్యార్థులు దుమ్ము నవీన్ కుమార్, జే.హాసినీ, ఎస్.హరి సింహాద్రి కైవసం చేసుకున్నారు.

ఎలా తయారు చేశారంటే..

ఆస్పత్రుల్లో పేషెంట్‌కు సెలైన్ ఎక్కిస్తున్నప్పుడు సెలైన్ అయిపోయిన వెంటనే చూసుకోకపోతే రోగి రక్తం సెలైన్ పైపులోకి వచ్చేస్తుంది. దీన్ని నివారించడానికి 5 ఎంఎల్ సెలైన్ మిగిలి ఉండగానే అలారం (సెలైన్ రిమైండర్) మోగేలా వీరు ప్రాజెక్టు తయారు చేశారు. ఇంతటి విజయం సాధించినందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్, డీఈఓ తిరుమల చైతన్య గైడ్ టీచర్ ఎస్.ఉమామహేశ్వరితో పాటు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ముఖ్యమంత్రితో సౌమ్య స్వామినాథన్ సమావేశం


సీఎం మోహన్ చరణ్‌తో చర్చిస్తున్న స్వామినాథన్

భువనేశ్వర్: చెన్నైలోని ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయంలో వీరిరువురు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సహాయ ప్రముఖ కార్యదర్శి నికుంజ్ బిహారీ ధొలా, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి పాల్గొన్నారు. అనంతరం ఆమె ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి సాంప్రదాయ మరియు సేంద్రీయ వ్యవసాయ ప్రక్రియల ద్వారా వరి, పెసలు, నల్లరేగడి, మినుములు మరియు ఇతర తృణధాన్యాల సాగుపై ఉద్ఘాటించారు. కాలక్రమేణా అంతరించి పోతున్న సంప్రదాయ విత్తనాలను సంరక్షించేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించనుందని వివరించారు. ఈ సమావేశంలో పలు ఇతర వ్యవసాయ సంబంధిత అంశాలను వీరిరువురు చర్చించారు. ఈనెల 7, 8 తేదీల్లో చెన్నైలో జగనున్న ఆకలి రహిత ప్రపంచం శీర్షికతో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరు కావాలని డాక్టర్ స్వామినాథన్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్‌ను ఆహ్వానించారు.

మంత్రి సురేష్ పూజారిని కలిసిన ఎమ్మెల్యే నర్సంగ్


మంత్రి సురేష్ పూజారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నర్సంగ్ మాడ్కమి


మంత్రి విభూతి భూషణ్ జెన్నకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే నర్సంగ్ మాడ్కమి

మల్కన్‌గిరి: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో రెవెన్యూ మంత్రి సురేష్ పూజారిని మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సంగ్ మడ్కామి గురువారం కలిశారు. జిల్లాలో ఇళ్లలోని గిరిజనులు, పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయినవారిని ఆదుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విభూతి భూషణ్ జెనాను కలిసి మల్కన్‌గిరి జిల్లా కేంద్రం నుంచి బస్సు సౌకర్యం లేని గ్రామాలకు సౌకర్యాలకు కల్పించాలని విన్నవించారు. దీంతో వెంటనే మంత్రి ఒడిశా ఆర్టీసీ చీఫ్ మేనేజర్‌తో చర్చించి ఆగస్టు 8న మల్కన్‌గిరిలో సమావేశమై అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

‘బాలల అభ్యున్నతికి నిధులు వినియోగించాలి’


సమావేశంలో మాట్లాడుతున్న సునేమీ మండల్

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా సమితి కేంద్రంలో నిరుపయోగంగా పడివున్న పంచాయతీ ని. ధుల్లో ఐదు శాతం బాలల అభ్యున్నతికి ఖర్చు చేయాలని గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండల్ పంచాయతీ ప్రతినిధులను కోరారు. దీనిలో భాగంగా గుమ్మా బ్లాక్ కార్యాలయంలో పంచాయతీ ప్రతినిధులుతో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శిశు వికాస్ ప్రాజెక్టు అధికారి పుష్పాంజలి సాహు మాట్లాడుతూ బాలల హక్కులు, భ్రూణ హత్యల నివారణ, లింగ నిర్ధారణ పరీక్షల నివారణ, అన్యాయంగా దత్తత తీసుకుని బాల కార్మికులుగా మార్చే విధానానికి స్వస్తి పలకడం, బాలలందరికీ ఉన్నత విద్యపై అన్‌టైడ్ నిధులు ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, గుమ్మా సంప్రసారణ అధికారి టి.సూరి, బీడీవో ఆకాష్ కుమార్ పండా, అరుణ స్వచ్ఛంద సంస్థ (బరంపురం) ప్రాజెక్టు మేనేజరు రూపక్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని మృతిపై దర్యాప్తు


గురుకుల పాఠశాల డార్మిటరీని పరిశీలిస్తున్న గురుకులాల హెడ్ ఆఫీస్ వైద్యుడు రాజేష్

నందిగాం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు. గురుకులాల జిల్లా సమన్వయకర్త బాలాజీనాయక్ ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. బుధవారం రాత్రి పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ గురుకులాన్ని సందర్శించి సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అలాగే గురుకుల విద్యాలయ సంస్థల వైద్యుడు డాక్టర్ రాజేష్ అమరావతి నుంచి గురుకులాన్ని సందర్శించి ఘటన జరిగిన తీరును, చనిపోయిన విధానం, తోటి విద్యార్థినులతో ఎలా మెలిగేది, వారి తల్లిదండ్రుల వివరాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గురుకులాల సమన్వయకర్త మాట్లాడుతూ జరిగిన ఘటన బాధాకరమని, విద్యార్థిని మృతిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కనిపించడం లేదని తెలిపారు. హెడ్ ఆఫీస్ నుంచి వచ్చిన అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టి తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వలస వెళ్లి.. బందీలుగా మారి



- చేపల వేటకెళ్లి శ్రీలంకలో చిక్కుకున్న జిల్లా వాసులు
- స్వస్థలానికి తీసుకురావాలంటూ కుటుంబ సభ్యుల విన్నపం

శ్రీకాకుళం రూరల్:

పొట్టకూటి కోసం వలస వెళ్లారు. కాసింత అదనపు ఆదాయం వస్తుందని కన్నవారిని, ఉన్న ఊరిని విడిచిపెట్టి పొరుగు రాష్ట్రంలో పనిచేసుకుంటున్నారు. చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో శ్రీలంక కోస్టుగార్డులకు జిల్లా మత్స్యకారులు చిక్కారు. ప్రస్తుతం అక్కడ జైలులో ఉన్నారు. వారి క్షేమ సమాచారం తెలియక కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. వారిని ఎలాగైనా కాపాడాలని స్థానిక ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పెదగనగళ్లవానిపేట పంచాయతీ పరిధిలోని చినగనగళ్లవానిపేటకు చెందిన గనగళ్ల కొర్లయ్య, దాసరి వెంకయ్యలు తమిళనాడులో పనిచేస్తున్నారు. జూన్ 25న వారు తమిళనాడులోని మద ఏపీఎస్ 5138 అనే బోటుతో చేపల వేటకు బయల్దేరారు. సముద్రంలో ఆటుపోట్ల కారణంగా అలా ముందుకు వెళ్లిపోయి శ్రీలంక కోస్టుగార్డులకు చిక్కారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో ఎలాగైనా వారిని విడిపించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే గ్రీవెన్స్‌లోనూ, మత్స్యశాఖ అధికారులకు గడిచిన రెండు రోజులుగా వినతి పత్రాలు అందజేశారు. ప్రస్తుతం శ్రీలంకలో జైలు జీవితం గడుపుతున్న కొర్లయ్య, వెంకయ్యల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారిని వెంటనే విడిపించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను, రాజకీయ నాయకులకు మత్స్యకార నాయకులు చీకటి గురుమూర్తి, కోనాడ నర్సింగరావు కోరుతున్నారు.


మత్స్యశాఖ అధికారులకు కలిసిన కొర్లయ్య, వెంకయ్య కుటుంబ సభ్యులు

చేపల వేటే ఆధారం



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేము చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాం. నా భర్త కొర్లయ్య 6వ నెలలో తమిళనాడు నాగపట్నంకు చేపలు వేటకు వెళ్లాడు. చేపల వేట సాగిస్తుండగా మార్గం మధ్యలో వారి రూటు మారిపోయి శ్రీలంక బోర్డుకు చేరుకున్నారు. అధికారులు ఎలాగైనా నా భర్తను తిరిగి తీసుకురావాలి.

– గనగళ్ల అరుణ, చినగనగళ్లవానిపేట

దుర్భర జీవితం అనుభవిస్తున్నారు



శ్రీలంక జైలులో నా భర్త వెంకయ్య బందీగా ఉన్నాడు. నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నా భర్త పరిస్థితి ఏమీ బాగులేదు. అక్కడ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఆయనకు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఎలాగైనా తీసుకురావాలి. పిల్లలు చాలా కంగారు పడుతున్నారు.

– దాసరి లక్ష్మి, చినగనగళ్లవానిపేట

అప్పట్లో వైఎస్ జగన్ 22 మందిని విడిపించారు



వైఎస్ జగన్ అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు 22 మంది మత్స్యకారులు పాకిస్తాన్‌లో చిక్కుకున్నారు. వారిని జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బయటకు తీసుకువచ్చారు. అందరికీ రూ.5 లక్షలు చొప్పున అందించారు. ఇప్పుడు టీడీపీ నాయకులు కూడా శ్రీలంకలో చిక్కుకున్న మా వారిని విడిపించి తీసుకురావాలి.

– కోనాడ నర్సింగరావు, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు

క్లుప్తంగా

పెరుగుతున్న జ్వర పీడితులు

- నియంత్రణకు ప్రత్యేక ఓపీలు
- డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి


మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి

పార్వతీపురం టౌన్: జిల్లాలో జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నాయని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె జిల్లా ఆస్పత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, వర్షాల కారణంగా జ్వరాలకు సంబంధించి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. ప్రతిరోజూ జిల్లా ఆస్పత్రికి 60 నుంచి 70 మంది జ్వరాలతో వస్తున్నారని ఇందులో ఎక్కువ భాగం వైరల్ జ్వరాల కేసులు ఉంటున్నాయన్నారు. రోజుకు 8 నుంచి 10 వరకు మలేరియా కేసులు నమోదవుతున్నట్లు తెలిపారు. చిన్న మేరంగి పాల కొండ గిరిజన ప్రాంతాల నుండి రోజుకు రెండు నుంచి మూడు వరకు డెంగీ కేసులు నమోదవుతు న్నట్లు చెప్పారు. జ్వరాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా సరిపడా మందులు, వైద్య సేవలకు సౌకర్యాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఉన్న ఎనిమిది సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులలో మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్‌కు సంబంధించి ఆస్పత్రుల్లో సంబంధించి ఒక విభాగాన్ని ఏర్పాటు చేశామని, 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారని వివరించారు.

కారు ఢీకొని సైక్లిస్ట్‌కు తీవ్రగాయాలు


ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన గెద్ద సత్యం

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామంలో జాతీయ రహదారి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో సైక్లిస్ట్ తీవ్రగాయాల పాలయ్యాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజపతినగరం నుంచి మరుపల్లి గ్రామానికి సైకిల్‌పై వెళ్తున్న గెద్ద సత్యం(70)ను వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టి పరారైంది. దీంతో సత్యం తలకు బలమైన గాయాలు కావడంతో బంధువులు వెంటనే విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గురువారం సాయంత్రం గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి కుమార్తె ఎస్.దేవి ఫిర్యాదు మేరకు ఎస్సై యు.మహేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి కిడ్నాప్‌పై కేసు నమోదు

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామంలో బాలుడిని కిడ్నాప్ చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఇద్దరు ఫైనాన్స్ సంస్థ నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి గ్రామానికి చెందిన కాపుగంటి సన్యాసిరావు దంపతులు ఎస్.కోటకు చెందిన ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నుంచి గత ఏడాది రూ.1.20 లక్షలు రుణం తీసుకున్నారు. ఇప్పటివరకు అరవైవేల రూపాయలు చెల్లించారు. మరో అరవైవేలు చెల్లించాల్సి ఉంది. ప్రతినెలా వాయిదాల మేరకు సొమ్ము చెల్లిస్తున్న క్రమంలో జూలై నెలకు సంబంధించిన వాయిదా నెలాఖరున జమ చేయలేదని సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులు అరిగిపాలెం గ్రామానికి బుధవారం సాయంత్రం వచ్చారు. ఆ సమయంలో సన్యాసి రావు ఇంటి దగ్గర లేకపోవడంతో గొడవపెట్టుకుని ఆయన కుమారుడిని వాహనంపై ఎస్‌కోట ఫైనాన్స్ ఆఫీసుకు తీసుకువెళ్లి నిర్బంధించారు. ఈ మేరకు కాపుగంటి సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదుతో ఫైనాన్స్ సంస్థపైన, సన్యాసిరావు కుమారుడిని తీసుకువెళ్లిన ప్రతినిధులపై కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

బాలుడి దుర్మరణం


మృతి చెందిన మణికంఠ (ఫైల్)

బొబ్బిలి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఏడో తరగతి చదువుతున్న మణికంఠ దుర్మరణం చెందాడు. గురువారం రాత్రి బొబ్బిలి పట్టణంలో జరిగిన ఈ విషాదక ర సంఘటనపై ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఓంకార్ థియేటర్ జంక్షన్‌లో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఒమ్మెల శ్రీనివాసరావు, కుమారిల పెద్ద కుమారుడు మణికంఠ(10) తన మామయ్య ఇంటికి సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అక్కడి జయప్రకాష్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో మణికంఠ తలపై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మణికంఠ గొల్లపల్లి జీఎస్ఎస్ పాఠశాలలో చదువుతున్నాడు. ఇప్పుడే వస్తానని ఇంటి దగ్గర చెప్పి వెళ్లిన కుమారుడు విగత జీవిగా మారడంతో తల్లిదండ్రులు శ్రీనివాసరావు, కుమారిల రోదనలు మిన్నంటాయి. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఎం.నాగేశ్వర రావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.లోవరాజు తెలిపారు.

తల్లిపాలు అమృతంతో సమానం

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్


ఆరోగ్యమిత్రపై ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ అరుణ శుభశ్రీ


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: తల్లిపాలు అమృతంతో సమానమని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను స్థానిక ఘోషా ఆస్పత్రిలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను వివరిస్తూ రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విలువైన పోషకాలు తల్లిపాలతో బిడ్డకు అందుతాయని, బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల ఆమెకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. తల్లిపాల విశిష్టతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తల్లిపాల వారోత్సవాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు టీకాతో సమానమన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించడం వల్ల అమృతంలా పనిచేస్తాయని చెప్పారు. అన్ని రకాల పోషకాలు అదుతాయని, శిశు మరణాలు తగ్గుతాయని చెప్పారు. బిడ్డకు ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు ఇవ్వవచ్చునని తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు మాట్లాడుతూ బిడ్డ రోగ నిరోధక శక్తిని పెంచడానికి తల్లి పాలు దోహదం చేస్తాయని చెప్పారు. నెలలు తక్కువగా జన్మించిన బిడ్డకు కూడా ఇవి ఎంతో మంచిదని తెలిపారు.

ఆరోగ్య మిత్ర పై కలెక్టర్ ఆగ్రహం

తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ముగిసిన తర్వాత ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఆరోగ్య మిత్ర శ్రీనివాస రావు పనితీరుపై ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణ శుభశ్రీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆరోగ్య మిత్రపై కలెక్టర్ మండి పడ్డారు. తక్షణమే ఆరోగ్యమిత్రను విధుల నుంచి తప్పించి ఆ స్థానంలో మరొకరిని నియమించాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావును ఆదేశించారు. ఆరోగ్యశ్రీ విభాగానికి ఒక కంప్యూటర్, స్కానర్‌ను సమకూర్చాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సుజాత, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలు ప్రారంభం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డా.కె. విజయ పార్వతి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో తల్లి పాల వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.కె.విజయపార్వతి ప్రపంచ తల్లిపాల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను జిల్లా ఆస్పత్రిలో ఆవిష్కరించారు. 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఆస్పత్రిలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ వారం అంతా జిల్లా వ్యాప్తంగా 37పీహెచ్‌సీలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, 3సీహెచ్‌సీలు, 3 ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రిలో ఆయా పరిధిలోని ఉపకేంద్రాలు, గ్రామాల్లో వైద్య సిబ్బంది, డాక్టర్స్ అవగాహన కల్పిస్తారని తెలిపారు. తల్లిపాల వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ మొదటి 6 నెలలు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణాహారమని, తల్లిపాలు న్యూమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి రక్షిస్తాయని, పిల్లల మేధస్సు మెరుగు పరుస్తాయని, తల్లీబిడ్డల మధ్య బంధం పెంచుతాయన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా బి.వాగ్దేవి, డీఐఓ డా.నారాయణ, వైద్యాధికారులు టి.వై విజయమోహన్, డా. లావణ్య, పీపీ యూనిట్ వైద్యాధికారులు, డీపీహెచ్ఎన్‌ఓ ఉషారాణి, డెమోలు సన్యాసిరావు, యోగీశ్వరరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ జయగౌడ్, ఎంపీహెచ్ఎస్(ఎఫ్) పుష్ప తదితర సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనోత్పత్తుల మార్కెటింగ్‌కు చర్యలు

- ఐటీడీఏ పీవో రాహుల్ కుమార్‌రెడ్డి

సీతంపేట: గిరిజనోత్పత్తులకు పూర్తిస్థాయిలో మార్కెటింగ్ కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానికంగా జీసీసీ నిర్వహిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను, అక్కడ విక్రయిస్తున్న గిరిజన సహకార సంస్థ ఉత్పత్తులు పరిశీలించారు. ఏఏ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు, వాటి ధరల వివరాలు తెలుసుకు న్నారు. అనంతరం అక్కడ డీఆర్‌డిపోను, సరుకులు నిల్వ చేసే గోదా మును చూశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలు, గురుకులాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీసీసీ జీఎం జి.సంధ్యారాణి, సీతంపేట, పాతపట్నం బ్రాంచ్ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బిర్యాని తిన్న 21 మంది విద్యార్థులకు అస్వస్థత

- వారిలో ఇద్దరి పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కు తరలింపు


కరక వలస ఆశ్రమంలో విచారణ చేపడుతున్న తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు


ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరావు

గంట్యాడ: చికెన్ బిర్యాని తిన్న పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... గంట్యాడ మండలం కరకవలస గ్రామంలోని ప్రేమవెలుగు సేవా సంస్థ ఆశ్రమంలో ఎస్.కోట, అనంతగిరి, పాచిపెంట, అరకు, మారిక వలస ప్రాంతాలకు చెందిన 46 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతూ కరకవలస, రామవరం, పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ నెల 30వ తేదీ రాత్రి విద్యార్థులకు నిర్వాహకులు చికెన్ బిర్యాని పెట్టారు. అది తిన్న తర్వాత ఇద్దరు విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కావడంతో నిర్వాహకులు ఘోషా ఆస్పత్రికి తరలించారు. 31వ తేదీ ఉదయం మరో నలుగురికి వాంతులు విరేచనాలు కావడంతో వారిని కూడా ఘోషా ఆస్పత్రిలో చూపించిన తర్వాత వారి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. వారిలో 21 మంది విద్యార్థులకు మళ్లీ వాంతులు, విరేచనాలు ప్రారంభం కావడంతో ఎస్.కోట ఆస్పత్రిలో గురువారం వారి తల్లిదండ్రులు చేర్పించారు. వీరిలో మజ్జి సన్యాసమ్మ (9), జన్ని నవ్య (13)ల పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

విద్యార్థులను పరామర్శించిన డీఎంహెచ్‌ఓ

ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్న వరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను డీఎంహెచ్‌ఓ ఆదేశించారు.

ఆశ్రమాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకున్న వెంటనే తహసీల్దార్ నీలకంఠశ్వర రెడ్డి, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు కరకవలసలో ఉన్న ప్రేమ వెలుగు సేవా సంస్థ ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారు, ఎలాంటి ఆహారం తీసుకున్నారన్న వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం నిర్వహణ అనుమతులపై ఆరా తీశారు. వసతి గృహ నిర్వహణకు అనుమతులు లేవని తెలిసింది. దీనిపై విచారణకు హాజరు కావాలని తహసీల్దార్ నీలకంఠశ్వరరెడ్డి నోటీస్ ఇచ్చారు. ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందించినట్టు తహసీల్దార్ తెలిపారు.

హైవే రోబరీలో మరో ఇద్దరి అరెస్ట్

- రూ.17 లక్షల 35వేల నగదు, రూ.5 లక్షల విలువైన బంగారం సీజ్
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై 2023 మే నెలలో జరిగిన హైవే రోబరీ కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి రూ.17.35 లక్షల నగదు, రూ. 5లక్షల విలువైన బంగారు వస్తువులను రికవరీ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలంలోని చోడమ్మ అగ్రహారం 16వ నంబర్ జాతీయ రహదారిలో ఫ్లైఓవర్‌పై 2023 మే నెలలో రోబరీ జరిగింది. ఒడిశా రాష్ట్రంలోని పర్లాకిమిడికి చెందిన బియ్యం వ్యాపారి కోట్ల వంశీకృష్ణ వ్యాపారుల నుంచి వసూలు చేసి, కారులో రూ. 50 లక్షలను తీసుకుని వస్తుండగా, నిందితులు చోడమ్మ అగ్రహారం వద్ద కారును అడ్డగించి, రూ.50 లక్షలు దోచుకుని పరారయ్యారు. ఈ నేపథ్యంలో బాధితుడి ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో వంశీకృష్ణ కారు డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు నిందితులు ఒక బృందంగా ఏర్పడి, దోపిడీకీ పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో కారు డ్రైవర్‌తో సహా ఆరుగురు నిందితులను గతంలోనే అరెస్ట్ చేసి రూ.5.70 లక్షలను రికవరీ చేశారు. కానీ కేసులో ప్రధాన నిందితుడైన పర్లాకిమిడికి చెందిన రుద్ర పంక్తి మధు దోపిడీలో దోచుకున్న డబ్బులో ఎక్కువ మొత్తం తీసుకుని పరారయ్యాడు. అప్పటి నుంచి నిందితుడి కోసం సీసీఎస్ పోలీసులు గాలిస్తుండగా పరారీలో ఉన్న నిందితుడు మధు కందివలస సంత వద్ద బుధవారం కనబడడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.12.10 లక్షల నగదు, రూ.5 లక్షల విలువైన బంగారు వస్తువులను రికవరీ చేశారు. అనంతరం నిందితుడు మధును విచారణ చేయగా ఈ నేరం చేసేందుకు తమకు పథకం రూపొందించింది దారపు గోపాలకృష్ణ అనే లాయరు అని విచారణలో వెల్లడించాడు. నిందితుడిచ్చిన సమాచారంతో లాయర్ గోపాలకృష్ణను అరెస్ట్ చేసి, రూ.5.25 లక్షలను రికవరీ చేశారు. సమావేశంలో ఎస్బీ సీఐ ఈ.నరసింహమూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సీసీఎస్ ఎస్సైకి ప్రోత్సాహక నగదు బహుమతి అందజేస్తున్న ఎస్పీ

ప్రతిభ కనబర్చిన పోలీసులకు ప్రశంసలు

కేసులో ఎంతో శ్రమించి, నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీసీఎస్ సీఐ ఎ.సత్యనారాయణ, ఎస్సై బి.భాగ్యం, ఏఎస్సై ఎ.గౌరీశంకర్, హెచ్‌సీలు ఎం.రామకృష్ణారావు, డి.శ్రీనివాసరావులను ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

జామి: మండలంలోని అలమండ గ్రామం శివారు మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జామి ఎస్సై వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఏడుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని వారి నుంచి రూ.71,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాట, కోడిపందాలు వంటివి నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీతంలో ఎలక్ట్రానిక్ డిజైన్ ప్రయోగశాల ప్రారంభం


ప్రారంభిస్తున్న సీతం విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ డిజైన్ ప్రయోగశాల, ఎలక్ట్రికల్ సిమ్యులేషన్ ప్రయోగశాలలను సీతం విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా జేఎన్‌టీయూ రూపొందించిన పాఠ్యాంశాల ఆధారంగా ఈ ప్రయోగశాలలను ఏర్పాటు చేశామని తెలియజేశారు. సాంకేతిక విద్యలో థీరిటకల్ నాలెడ్జ్‌తో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ కీలకమని అందుకు అనుగుణంగా ప్రయోగశాలలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, వైస్‌ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీఏనాయుడు, ఈఈఈ విభాగాధిపతి వై.సంతోష్, డీన్ డాక్టర్ వై.నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వంగర సత్య

పార్వతీపురంటౌన్: ఎమ్మెల్యే ఎదుట ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పార్వతీపురం పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మున్సిపాలిటీ పరిధి కొత్తవలస విజయరామరాజు కాలనీకి చెందిన వంగర సత్య కూలిపని చేసుకుంటూ మూడో తరగతి చదువుతున్న కుమారుడు రాఘవతో కలిసి జీవనం సాగిస్తోంది. ఆమె భర్త జగదీశ్వరరావు మూడేళ్ల కిందట చనిపోయాడు. ఏడాదిగా పార్వతీపురం సారిక వీధికి చెందిన రాపాక పవన్‌కుమార్ ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పి సహజీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పెళ్లిచేసుకోవాలంటూ ఆమె పవన్‌కుమార్‌ను కోరింది. దీనికి ఆయన నిరాకరిస్తూ నీ బతుకు నువ్వు బతుకు నా బతుకు నేను బతుకుతాను, నాపై ఆశపడవద్దని తేల్చిచెప్పాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె చనిపోవాలని నిర్ణయానికి వచ్చింది. రాయగడ రోడ్డులోని విజయలక్ష్మి కళ్యాణ మండపంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సమక్షంలో జరుగుతున్న విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం వద్దకు వెళ్లి బ్లేడుతో పీక కోసుకుంది. రక్తపుమడుగులో పడి ఉన్న ఆమెను అక్కడి నాయకులు, సంఘ సభ్యులు ఆమెను వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జొన్నపంటలో ఏనుగుల గుంపు

- రైతుల ఆందోళన

జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపు రం, పెదకుదమ, చినకుదమ గ్రామాల్లోని జొన్న పంట పొలాల్లో ఏనుగులు గురువారం దర్శనమిచ్చాయి. అదే ప్రాంతంలో అరటి, పామాయిల్ తోటలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జొన్న పంటను ధ్వంసం చేశాయని రైతులు వాపోతున్నారు. నాగా వళి కాలువ ఉండడంతో మధ్యాహ్నం కాలువలోకి వెళ్లి పంట పొలాల్లోకి జారుకుంటున్నాయ ని రైతులు చెబుతున్నారు. వరి ఉబాలు కూడా జరుగుతుండడంతో వరిపంటకు నష్టం జరగకుండా అటవీ శాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంత్రి ఇలాకాలో చిరుద్యోగుల తొలగింపు

- కొఠారుబిల్లి కేజీబీవీలో కుక్, నైట్ వాచ్‌మన్ తొలిగింపు
- వారి స్థానంలో టీడీపీ సానుభూతి పరుల నియామకం



కొఠారుబిల్లి కేజీబీవీ

గంట్యాడ:

అధికారంలోకి వచ్చినదే మొదలు అరాచక పాలనకు కూటమి నేతలు గేట్లు తెరిచారు. ఓ వైపు ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు. మరోవైపు అధికారులను, చిరుద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. చెప్పిన మాట వినని అధికారులపై బదిలీ వేటు వేస్తున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారిని నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు.

ఆ స్థానాల్లో టీడీపీ సానుభూతిపరులను నియమిస్తున్నారు. దీనికి సాక్షాత్తు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సొంతమండలమైన గంట్యాడలోని కొఠాబిల్లి కేజీబీవీలో ఉద్యోగుల తొలగింపే నిలువెత్తు నిదర్శనం. ఇక్కడ ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న రొంగలి శ్రీలక్ష్మి(కుక్), ఆర్.దుర్గ (నైట్ వాచ్‌మన్)ను విధుల నుంచి ఇటీవల తొలగించారు. ఇదెక్కడి అన్యాయమని పలువురు నిలదీసినా ఫలితం శూన్యమే అయ్యింది. వారి స్థానంలో టీడీపీ సానుభూతిపరులు ఇద్దరిని నియమించారు. టీడీపీ నాయకుల మాటవినని, అక్రమాలకు సహకరించని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందిని బెదిరిస్తుండడంతో హడలిపోతున్నారు. చివరకు బుక్ కీపర్లుగా పనిచేసే వారిని సైతం తొలిగించాలని కూటమి నేతలు అధికారులపై ఒత్తిడితెస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

కేజీబీవీలో ఐదేళ్లుగా పనిచేస్తున్న కుక్, నైట్‌వాచ్‌మన్‌ను విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఇద్దరినీ ఆపేశాం. అధికారులు పంపిన పేర్ల మేరకు వారి స్థానంలో మరో ఇద్దరిని నియమించాం. – అల్లు జ్యోతి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, కొఠారుబిల్లి

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు


నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

- అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలని అధికారులకు ఆదేశం
- అత్యాచారానికి పాల్పడిన హోంగార్డును విధుల నుంచి తొలగిస్తాం
- ఎస్పీ వకుల్ జిందాల్

నెల్లిమర్ల/చీపురుపల్లి: నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలని, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకాలను కట్టడి చేయాలని సూచించారు. నెల్లిమర్ల, చీపురుపల్లి పోలీస్ స్టేషన్లను ఆయన గురువారం పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, పోలీస్ క్వార్టర్లు, ప్రాపర్టీ రూమ్, లాకప్ గదులు పరిశీలించారు. జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ ఇండెక్స్, రిసెప్షన్ రిజిస్టర్, సీడీ ఫైల్స్, గ్రేవ్ కేసులు, బీట్ బుక్‌లను తనిఖీ చేశారు. పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచేలా సిబ్బంది ప్రవర్తన ఉండాలని, అనైతిక చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. స్టేషన్‌లో పనిచేసే చెడునడత కలిగిన వ్యక్తుల వివరాలు అందజేయాలన్నారు. చంపావతి నదీ తీరంలోని ఇసుక రీచ్‌ల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలపై దర్యాప్తు చేయాలన్నారు. గంజాయి రవాణాచేస్తూ ఒకటికంటే ఎక్కువ సార్లు పట్టుబడితే పీడీ యాక్టు నమోదుచేయాలన్నారు. రహదారి ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లు గుర్తించి నియంత్రణకు భద్రత చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు కోసం ఉన్న కొత్త రక్షణ చట్టాలు, రహదారి భద్రత, మహిళల భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నెల్లిమర్లలో మహిళపై అత్యాచారానికి పాల్పడిన హోంగార్డును ఇప్పటికే అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు ఇలా చేయడం చాలా పెద్ద తప్పుగా భావిస్తూ ఆయనను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు స్పష్టం చేశారు. ఆయన వెంట విజయనగరం డీఎస్పీలు ఆర్.గోవిందరావు, ఏఎస్ చక్రవర్తి, సీఐలు బి.వెంకటేశ్వరరావు, షణ్ముఖరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఇ.నర్సింహమూర్తి, ఎస్సైలు రామ గణేష్, కె.కిరణ్‌కుమార్‌నాయుడు ఉన్నారు.